క్లుప్తంగా

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న వైద్యులు

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే ఆశా వర్కర్లతో వైద్య సిబ్బంది సమీక్షించారు. శుక్రవారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లు పురుషోత్తం నాయక్, యస్థానీ, శంకర్ సూచించారు. 0–5 ఏళ్ల వయసు లోపు ఉన్న చిన్నారులను గుర్తించి వంద శాతం పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

మిట్స్ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్



మిట్స్ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

కురబలకోట: మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించిందని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కళాశాలలో బోధన, అభ్యాసం, మూల్యాంకనం, పరిశోధనలు, నాణ్యమైన విద్య తదితర వాటిని దృష్టిలో ఉంచుకుని ఈ గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో తమ కళాశాలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరింత నాణ్యత, నవ్యతతో కూడిన విద్య, బోధన అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం కలశారాధన, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. మూల విరాట్టుకు అభిషేకం, అర్చన, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పీఎస్ చైతన్య ఆలయ ప్రధాన అర్చకులు ఎంఆర్ఎస్‌పీ కుమార శర్మ, శివకుమార్‌శర్మ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కలికిరి : మండలంలోని గుండ్లూరు గ్రామం కొర్నమిట్టపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, మాధవి దంపతుల అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమల్లో పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయండి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న పునీత్

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీలో ఆప్కాస్ నియామకాలకు సంబంధించి అర్హత లేని వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ప్రభుత్వ నిబంధనలు వర్తించేవారికి మాత్రమే అవకాశం కల్పించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి.. ఆప్కాస్ నియామకాలకు సంబంధించి ఇటీవల కౌన్సిల్ ఆమోదం తెలిపిన జాబితాను అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తూ పదవీ విరమణ లేదా అకాలమరణం చెందితే వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు, పెన్షన్ సౌకర్యం లేనందున, వారి కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొనడం జరిగిందన్నారు. అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, సుధాకర్, నవీన్, వెంకటేష్, రాజు, జగదీష్, మల్లికార్జున, శ్రీనివాసులు, కిషోర్, దేవేష్, వినయ్, శశికుమార్, ద్వారకనాథ్, సాదిక్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

పెద్దమండ్యం : మండల సర్వసభ్య సాధారణ సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ సి. వెంకటరమణయ్య తెలిపారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశానికి మండలంలోని ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల వివరాలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం

- కార్యకర్తలే పార్టీకి పునాదులు
- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు
- జగనన్నతోనే సంక్షేమ పథకాలు
- ఎంపీ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

వాల్మీకిపురం : కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. దళారి వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. సచివాలయ వ్యవస్థతో 500 సేవలను ఉపయోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారని, దీంతో గ్రామాల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారన్నారు. గ్రామాల్లో గడప గడపకు వెళ్తుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, సంక్షేమ పథకాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిప్పుకుంటూ ప్రజలను పీక్కుతింటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఫా మొహియిద్దిన్, సర్పంచ్ గంగులమ్మ, జెడ్పీటీసీ నిర్మల, నాయకులు సుధీర్‌రెడ్డి, సాయికృష్ణారెడ్డి, చింతల శివానందరెడ్డి, సహదేవరెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, అబ్దుల్ కలీమ్, నీళ్ల భాస్కర్, కేశవరెడ్డి, శ్రీధర్‌రాయల్, నరసింహులు, మహబూబ్‌బాషా, ఇబ్రహిం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిథున్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తపేట వీధిలో నూతనంగా నిర్మించిన 50 పడకల ప్రభుత్వాసుపత్రిని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 30 పడకల ఆసుపత్రిని 50 పడకలగా మార్చి, మెరుగైన వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అధునాతన పరికరాలతో ప్రజలకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఏ వ్యాధికైనా ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించే విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా అక్కడే వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అనుసంధానంతో 11 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులను అందుబాటులో ఉంచి, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

వార్డు మెంబర్‌గా గెలవని వ్యక్తితో మాకేమి పని

- ప్రాణమున్నంతవరకు వైఎస్సార్‌సీపీలోనే
- రామచంద్రయాదవ్‌కు ప్రజాదరణ శూన్యం
- తెచ్చుకున్న పూలు, అద్దెమనుషులతో కుళ్లు రాజకీయం



సమావేశంలో మాట్లాడుతున్న సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర తదితరులు.

మదనపల్లె : రాజకీయాల్లో కనీసం వార్డుమెంబర్‌గా కూడా గెలవని బోడే రామచంద్రయాదవ్‌కు ఘన స్వాగతం పలికి, జేజేలు పలకాల్సిన అవసరం, అగత్యం రెండూ తమకు లేవని సీటీఎం సర్పంచ్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు వెలుగుచంద్ర అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీటీఎం నలవీరగంగాభవాని జాతరలో పుంగనూరు నియోజకవర్గానికి చెందిన బోడే రామచంద్రయాదవ్‌కు ప్రజలు ఘనస్వాగతం పలకడమే కాకుండా ఆలయకమిటీ సభ్యులు రాచమర్యాదలు చేశారంటూ ఓ పత్రిక, సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేయడంపై మండిపడ్డారు. రామచంద్రయాదవ్ నలవీర గంగమ్మను దర్శించుకున్న సమయంలో తాము ఇద్దరూ అక్కడ లేమన్నారు. సీటీఎం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలమైన తమను ఒకరిని సర్పంచ్‌గా, ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా, మరొకరికి మండల ఎంపీపీగా, ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబాలకు ఎప్పటికీ విధేయులుగా ఉంటామన్నారు. ఊరుపేరు లేని రామచంద్రయాదవ్‌తో కలిసి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పైపెచ్చు రామచంద్రయాదవ్ సీటీఎం జాతరకు పుంగనూరు నుంచే జీపుల్లో పూలు, అద్దె మనుషులను పిలిపించుకుని, జేజేలు కొట్టించుకుంటూ, పూలు చల్లించుకుంటూ హంగామా సృష్టించుకున్నారే తప్ప అతడికి ప్రజాదరణ, బలం రెండూ లేవన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ పోగాకు వీరప్రతాప్, ఆర్‌బీకే చైర్మన్ శివారెడ్డి, క్రిస్టియన్ సెల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- ఇంటర్ హైపర్ స్క్వాడ్ మెంబర్ బాలకృష్ణమూర్తి



పరీక్షలకు సిద్ధం చేసిన బల్లలు

మదనపల్లె సిటీ : 'ప్రశాంత వాతావరణంలో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు అర గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమరాలను ఏర్పాటు చేశాం' అని ఇంటర్మీడియట్ హైపర్ స్క్వాడ్ మెంబర్, స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలికల కాలేజీలో విలేకర్లతో మాట్లాడారు. మదనపల్లెలో 11 కేంద్రాల్లో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అర గంట ముందే చేరుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఇప్పటికే విద్యుత్‌శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయలని సూచించారు.

సర్వం సిద్ధం

పీలేరు రూరల్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి, పి.వసంతమ్మ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు గంటముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పీలేరులో ఐదు పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, మొదటి సంవత్సరం 1,501, ద్వితీయ సంవత్సరం 1,350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

అందుబాటులోకి సహకార సేవలు

నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో గ్రామీణ సహకార సంఘాల ద్వారా వివిధ రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని వైఎస్సార్‌సీపీ మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని నిమ్మనపల్లె సింగిల్ విండో ఆధ్వర్యంలో రెడ్డివారిపల్లె, వెంగంవారిపల్లె గ్రామాల్లో రూ.80 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్లు, నిమ్మనపల్లెలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద భారతీయ జన ఔషధీ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్‌ను ఎంపీపీ నరసింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులరెడ్డి, డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి రవిచంద్రన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు రుణాలు అందించడమే కాకుండా.. ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సహకార సంఘాలు పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ జరిగి బ్యాంకింగ్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయన్నారు. ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలతో మందులు వాడుతున్నారని, సాధారణ మందుల దుకాణాల్లో అధిక ధరలు చెల్లించి ఆర్థిక భారం మోస్తున్నారన్నారు. అలాంటివారికి 30 నుంచి 80 శాతం రాయితీతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం ద్వారా మందులు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్‌రెడ్డి, దండు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే సదాశివరెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, గంగాధర, సహకార బ్యాంకు ఏజీఎం చంద్రకళ, లైజనింగ్ అధికారి, ఏజీఎం వై.యోగేశ్వర్ రెడ్డి, డీసీఓ రవిచంద్రన్, నోడల్ అధికారి సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మదనపల్లె : మండలంలోని వలసపల్లె పంచాయతీలో రూ.20 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు నిసార్ అహ్మద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వలసపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో నిసార్‌అహ్మద్, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ తదితరులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ వలసపల్లె పంచాయతీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల వలసపల్లెలో పర్యటించినప్పుడు గ్రామస్తులు సమస్యలను తన దృష్టికి తెచ్చారని, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహించారు. 362 మంది విద్యార్థులు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ విభాగంపై నిర్వహించిన పరీక్షల్లో 183 మంది అర్హత సాధించారు. అనంతరం జరిగిన సభలో మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించి జీవితాల్లో స్థిరపడటం అన్నది యజ్ఞంగా మారిందన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా సిద్ధమై ఉద్యోగాలకు, పోటీ పరీక్షల్లో సత్తాచాటాలని అన్నారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెండ్ జిల్లా అధికారి బి.హరికృష్ణ, కోఆర్డినేటర్ రేవతి, ప్లేస్‌మెంట్ అధికారి బి.రాజేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిని

ప్రజలకు వివరించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవికాలంలో పట్టణంలో నీటిసమస్య తలెత్తకుండా కౌన్సిలర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డులో పైప్‌లైన్ లీకేజీలు, బోర్ల రిపేరీలు, ఇతర మరమ్మతులు ఏవైనా ఉంటే... వాటిని సిబ్బంది సహాయంతో చేయించాలని సూచించారు. నీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నివేదిక తయారుచేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. పక్కా ప్రణాళికతో నీటిసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అజెండాలోని 31అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బి.ఏ.ఖాజా మాట్లాడుతూ తమ వార్డులో బోరు రిపేరీ గురించి అధికారులకు తెలిపి 45 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నీటిసమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తమ వార్డు ప్రజల వినతి మేరకు కమ్యూనిటీ హాల్, ఆర్వో ప్లాంటును కేటాయించినందుకు కౌన్సిల్, చైర్‌పర్సన్ మనూజారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్ ఆజం మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, వీటి బెడద నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. 9వవార్డు కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వీధిదీపాలు వెలగడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటోందని తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలన్నింటికీ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, ఆర్వో నాగేశ్వరరావు, ఏఈలు స్నేహప్రియ, బండపల్లిశిరీషా, ఆర్ఐలు రెడ్డెమస్తాన్, నాగరాజ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ జగదీశ్వర్‌రెడ్డి, సర్వేయర్ పూర్ణ, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నాయకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : పేదల బతుకుల్లో వెలుగు రావాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం కన్నెమడుగు పర్యటనలో భాగంగా స్థానిక సర్పంచ్ శ్యామలమ్మ, ఆమె కుమారుడు చినబాబు స్వగృహంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారని తెలిపారు. నేడు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు సీఎం అహర్నిశలు చేస్తున్నారని తెలిపారు. మరోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు మహేష్, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, జమాల్‌బాషా, రామూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

కడప ఎడ్యుకేషన్: రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా మంచి ఉత్తీర్ణతను సాధించే విధంగా ఎంఈఓలు ఉపాధ్యాయులకు సూచించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. డీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సారిగా గురువారం కడప ఎమ్మార్సీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఎంఈఓ-1 పాలెం నారాయణ, ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్‌లతో పలు అంశాలపై చర్చించారు. మార్చి 18వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. అలాగే ప్రత్యేక స్టడీ అవర్స్, పిల్లలకు స్లిప్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పీలేరు రూరల్: సమిష్టి కృషితో ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, రక్త మార్పిడి తదితర కారణాలతో హెచ్ఐవీ సోకే ప్రమాదముందని హెచ్చరించారు. ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ నాగవేణి, కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, హసీనా, రాజమ్మ, సల్మాన్, షర్మీల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



గంధంలో పాల్గొన్న కడప అమీన్‌పీర్ దర్గా పిఠాధిపతి

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల మౌలాకాపహాడ్ గంధమహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. మౌలాకాపహాడ్‌లో కడప అమీన్‌పీర్ దర్గా పిఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఖ్వాజా అరీఫుల్లా హుసేనీ ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. గంధం చదివింపులు భక్తి శ్రద్ధలతో జరిపారు. గంధ మహోత్సవానికి మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిషార్ అహ్మద్ హాజరయ్యారు. ఒకే రోజు గంధం, ఉరుసు, ఖవ్వాలీ పోటీలు నిర్వహించడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గంధమహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎస్ఐ చెన్నకేశవ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్ పద్మావతమ్మ, ఆర్‌బీకే చైర్మన్ చాను, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, సర్కాజీ ఎస్ఎండీ ఇస్మాయిల్, ముస్లిం పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జకియాఖానమ్, కడప అమీన్‌పీర్ దర్గా పిఠాధిపతి

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీ, మౌలాకా పహాడ్ వద్ద జెడ్పీ ఉన్నత ఉర్దూ పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జయాఖానమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సేవలను అందించడం హర్షనీయమన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ హజరత్ సయ్యద్‌షా అరిఫుల్లా హుసేనీ, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కరీముల్లా, మాజీ జెడ్పీటీసీ రమేష్, సర్పంచ్ జింకా విశ్వనాథ, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, అరవింద ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో చేపట్టిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కోరారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం కేవీపల్లెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధిపొందిందని తెలిపారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, గజ్జెల శీనురెడ్డి, యర్రమరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.